ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఓటింగ్‌కు పోటెత్తిన ఓటర్లు
- ఆత్మకూరు డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 76.34 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 95.07 శాతం ఓటింగ్
- స్థానిక సంస్థల స్థానానికి 99.99 శాతం పోలింగ్


జూపాడుబంగ్లా పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేయటానికి బారులు తీరిన పట్టభద్రులు


నందికొట్కూరు బాలికల స్కూల్‌లో ఓటు వేసేందుకు వచ్చిన దివ్యాంగుడు


జూపాడుబంగ్లాలో దివ్యాంగుడిని దిశ వాహనంపై రోడ్డు వద్దకు తీసుకెళ్తున్న పోలీసులు


పాములపాడు పోలింగ్ కేంద్రం వద్ద అడిషనల్ ఎస్పీ రమణ

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రులు, స్థానిక సంస్థలు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగిసింది. బండిఆత్మకూరు, ఆత్మకూరు మండలాల్లో ఓటర్లు పోటెత్తారు. నాలుగు గంటల లోపు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన ఓటర్లను ఎన్నికల అధికారులు ఓటింగ్‌కు అనుమతించారు. ఫలితంగా పోలింగ్ దాదాపు 5 గంటల వరకు కొనసాగింది. డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 76.34 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 95.07 శాతం ఓటింగ్ నమోదయ్యింది. అడిషనల్ ఎస్పీ రమణ, ఆత్మకూరు డీఎస్పీ శృతి ఆధ్వర్యంలో పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఆత్మకూరు మండలంలో పోలింగ్ ఇలా..

ఆత్మకూరు మండలంలో పట్టభద్రుల స్థానానికి ఓట్లను పరిశీలిస్తే పట్టణంలోని 316వ పోలింగ్ కేంద్రంలో మొత్తం ఓటర్లు 1,081 మంది ఓటర్లు కాగా ఇందులో పురుషులు 716 , మహిళలు 365 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా దాదాపుగా 67 శాతం పోలింగ్ నమోదైంది. 317వ పోలింగ్ బూత్‌లో మొత్తం 961 మంది ఓటర్లకు గాను 635 మంది పురుషులు 323 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 74.01 శాతం పోలింగ్ నమోదైంది. ఇదే తోవలో 321వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 897 మంది ఓటర్లకు గాను పురుషులు 655 , మహిళలు 242 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మొత్తం 76.16 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎన్నికల్లో ఆత్మకూరు పట్టణంలో మొత్తం ఓటర్లు 210 మంది కాగా, 203 మంది ఓటర్లుతమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్థానిక సంస్థల స్థానానికి 99.99 శాతం పోలింగ్

ఆత్మకూరు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి, నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాలకు చెందిన ఆయా మండలాల ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్‌లు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో తమ ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యేలు ఏరాసుప్రతాపరెడ్డి ఆత్మకూరుల బుడ్డారాజశేఖర్‌రెడ్డి వెలుగోడులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం రెవెన్యూ డివిజన్ పరిధిలో 165 మంది ఓటర్లకు గాను, 164 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పగిడ్యాల మండలం నెహ్రూనగర్ ఎంపీటీసీ సభ్యురాలు బీజేపీ పార్టీకి చెందిన ఎంపీటీసీ జయంతి తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. వెలుగోడు మండలంలో అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కనకమ్మ రహదారి ప్రమాదంలో తీవ్ర అస్వస్థతకు గురై కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆర్డీఓ కార్యాలయానికి వాహనంలో చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బండిఆత్మకూరులో భారీగా పోలింగ్

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు మండలంలో ఎమ్మెల్సీ స్థానాలకు భారీగా పోలింగ్ జరిగింది. పట్టభద్రుల స్థానానికి 82 శాతం , ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి 97 శాతం ఓటింగ్ నమోదైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద బండిఆత్మకూరు పీహెచ్‌సీ సిబ్బంది రమణాబాయి, సుబ్బమ్మల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తాలుకా సీఐ రవీంద్ర, ఎస్సై బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శ్రీశైలం మండలంలో ప్రశాతంగా..

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంమండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి. శ్రీశైలం సున్నిపెంట , లింగాలగట్టు గ్రామాల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 890 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా 652 మంది, 34 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 31 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉదయం నుంచే బారులు తీరిన పట్టభద్రులు

మహానంది: మహానంది మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద పట్టభద్రులు ఉదయం నుంచే బారులుదీరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 82.03శాతం ఓటింగ్ నమోదైంది. వీరితో పాటు ఉపాధ్యాయ స్థానానికి 35 మంది ఓటర్లు ఉండగా 34 మంది ఓటేయడంతో 97.14శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ జనార్దన్‌శెట్టి తెలిపారు.

వెలుగోడులో 78.6శాతం పోలింగ్

వెలుగోడు: మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో పట్టభద్రులు 78.6 శాతం, ఉపాధ్యాయులు 93.2 శాతం ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. అడిషినల్ ఎస్పీ రమణ, ఎస్సీ, ఎస్టీ విభాగం డీఎస్పీ రామాంజనాయక్, ఆత్మకూరు డీఎస్పీ శృతి, సీఐ సుబ్రహ్మణ్యం బందోబస్తును పర్యవేక్షిచి, పోలింగ్‌సరళి పరిశీలించారు.

నందికొట్కూరులో ఉపాధ్యాయ స్థానానికి 95.32 శాతం ఓటింగ్

నందికొట్కూరు: మండల పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. పట్టణంలో పట్టభద్రుల పోలింగ్ కేంద్రాల్లో 307 బూత్‌లో 1,028 ఓట్ల గాను 812 పోల్ కాగా 79.96 శాతం, 308 పోలింగ్ బూత్‌లో 1,056 ఓట్లకు గాను 793 పోలై 75.09 శాతం, 314 పోలింగ్ బూత్‌లో 705 ఓట్లకు గాను 586 పోల్ కాగా 83.12 శాతం ఓటింగ్ నమోదయ్యింది. టిచర్ పోలింగ్ కేంద్రంలో 164 పోలింగ్ బూత్‌లో 278 ఓట్లకు గాను 265 మంది టీచర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. 95.32 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పరిశీలించారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన మాండ్ర

పట్టణంలోని 308 పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు క్యూలో నిలబడి ఉండగా తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి నేరుగా అతని అనుచరులతో లోపలికి వెళ్లారు. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి,ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, శాతనకోట సర్పంచ్ జనార్ధన్‌గౌడు, మండల నాయకులు ఓంకారంరెడ్డి డిమాండ్ చేశారు. ఒకే సారి 20 మందిని లోపలికి ఎలా తీసుకెళ్తారంటూ ఆందోళనకు దిగ్గారు. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. టౌన్ సీఐ విజయ భాస్కర్, ఎస్ఐ ఎన్వీ రమణ జోక్యం చేసుకున్ని విచారణ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళనను విరమించారు.

పోటెత్తిన పట్టభద్రులు

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పట్టభద్రులు, ఉపాధ్యాయులు పోటెత్తారు. మండల వ్యాప్తంగా పట్టభద్రుల 77.54 శాతం, ఉపాధ్యాయ స్థానానికి 94.80 ఓటింగ్ శాతం నమోదు కావడం విశేషం.

జూపాడుబంగ్లాలో..

జూపాడుబంగ్లా: మండలం వ్యాప్తంగా 945 మంది గ్రాడ్యుయేటర్ల ఓట్లు ఉండగా అందరూ ఊహించిన దానికంటే ఎక్కువగా ఓట్లను వినియోగించుకొన్నారు. సాయంత్రం 4గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగించే సమయానికి 84.02శాతం గ్రాడ్యుయేటర్ల పోలింగ్ నమోదైనట్లు పీఓ నరసింహారెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేక డీఎస్పీ రామాంజినాయక్ పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 89.85శాతం పోలింగ్ శాతం నమోదైనట్లు పీఓ ప్రమోద్ తెలిపారు.


నందికొట్కూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్


మిడుతూరు పోలింగ్ కేంద్రంలో కుర్చీల్లో కూర్చున్న గ్రాడ్యుయేట్ ఓటర్లు


తిమ్మాపురం పోలింగ్ కేంద్రానికి మిత్రుడి సాయంతో వస్తున్న వికలాంగుడు

మిడుతూరు మండలంలో 83.29 శాతం పోలింగ్

మిడుతూరు: మండలంలో పట్టభద్రులు 952 ఓట్లు ఉండగా 793 (83.29 శాతం) మంది ఓట్లు పోల్ అయ్యాయి. ఉపాధ్యాయులు 38 మందికి 35 (92.10శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని సెక్టోరియల్ అధికారి విద్యాసాగర్, తహసీల్దార్ సిరాజుద్దీన్, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి పరిశీలించారు.

పాములపాడులో ఓటింగ్ ఇలా..

పాములపాడు: మండలంలో పట్టభద్రులు 951 మందికి గాను మహిళలు 173, పురుషులు 543 మంది 75.03 శాతం, ఉపాధ్యాయులు 36 మందికి గాను మహిళలు 12, పురుషులు 23 మంది 97.02 శాతం చొప్పున ఓటు హక్కు వినియోగించుకున్నారు. క్యూలైన్ అధికం కావడంతో పోలింగ్‌కేంద్రం వద్ద టెంట్లు ఏర్పాటు చేసి ఆవరణంలో కూర్చోబెట్టారు. పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించిన అడిషినల్ ఎస్పీ రమణ, ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పరిశీలించారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండలంలో కొత్తపల్లి పోలింగ్ భూత్ 315లో 631 గాను 496 మంది, ముసలిమడుగు పోలింగ్ భూత్ 315–ఎలో 199 గాను 153 మంది పట్టభద్రులు వారి ఓటు హక్కును వినియోగించుకోగా 78.55 శాతం పోలింగ్ నమోదయ్యింది. కొత్తపల్లి పోలింగ్ భూత్ 168 లో 42 మంది ఉపాధ్యాయులు ఉండగా 42 మంది వారి ఓటు హక్కును వినియోగించుకోవడంతో 100 శాతం పోలింగ్ జరిగింది.

క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు


కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో సోమవారం షష్టి సందర్భంగా ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

శివయ్యపై భక్తితో..


చెక్కకాళ్లపై నడుస్తూ శ్రీశైలం వెళ్తున్న కన్నడ భక్తులు

జూపాడుబంగ్లా: కన్నడిగుల భక్తి అంచంచలమైనది. వారి భక్తిప్రవృత్తులకు దేవాదిదేవుడైన శివయ్య ప్రసన్నుడు కావాల్సిందే. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం జిల్లా, చిక్కోడి తాలూకా, కబ్బూర్‌కు చెందిన గజానన్ నిర్వాణ్ అనే వ్యక్తి నాలుగు అడుగుల ఎత్తున్న చెక్కకాళ్లపై నిల్చొని నడుస్తూ శ్రీశైలం వెళ్తున్నాడు. సోమవారం జూపాడుబంగ్లాకు చేరుకున్నాడు. శ్రీశైలం మల్లన్న తాను అనుకొన్న కోర్కెలను తీర్చడంతో చెక్కకాళ్లపై నడుస్తూ శ్రీశైలం వెళ్తున్నట్లు తెలిపాడు.

చురుగ్గా అభివృద్ధి పనులు


డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని సర్పంచు వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. సోమవారం ఆ పనులను పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి సహకారంతో పనులు వేగంగా చేపడుతున్నామని, గ్రామంలో మౌలిక సమస్యలు లేకుండా ఎప్పటి కప్పుడు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

మహిమాన్వితుడు మహానందీశ్వరుడు


పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి స్వామిని సన్మానిస్తున్న ఈఓ, పండితులు

మహానంది: స్వయంభువుగా వెలసిన శ్రీ మహానందీశ్వరస్వామి మహిమాన్వితుడని నైమిశారణ్యం పీఠాధిపతి, ధార్మిక సేవాసమితి అధ్యక్షుడు శ్రీ బాలబ్రహ్మానంద సరస్వతీస్వామి తెలిపారు. మహానందిలో సోమవారం సాయంత్రం పరమేశ్వర తత్త్వంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. ఆయన మాట్లాడుతూ మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారి భక్తుల కోరికలను తీరుస్తూ కొంగుబంగారంగా నిలిచారన్నారు. ముక్కంటీశ్వరుడి ఆరాధనతో భక్తుల కష్టాలు తొలగిపోతాయని చెప్పారు. ప్రవచనాల అనంతరం ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ వై.మధు, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, తదితరులు ఆయనను సన్మానించి ప్రసాదాలు అందించారు.

ఏప్రిల్ 4న నంద్యాలకు చాగంటి కోటేశ్వరరావు రాక

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఏప్రిల్ 4న నంద్యాలకు రానున్నట్లు మన ఊరు–మన గుడి, మన బాధ్యత నిర్వాహకులు శివకుమార్ రెడ్డి, రాంప్రసాద్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక సందేశం ఇవ్వడానికి రానున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశుగ్రాసం దగ్ధం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ మజరా కృష్ణానగర్‌లో పశుగ్రాసం దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధిత రైతు షేక్ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు 5 ఎకరాల జొన్న చొప్ప, 4 ఎకరాల వరి గడ్డితో ఇటీవల వామిగా (గడ్డిని కుప్పగా నిర్మించడం) ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో పశు గ్రాసంతో పాటు ఎడ్ల బండి టైరు చక్రం కాలిపోగా, ఆవుకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.75వేల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

18న రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ

బనగానపల్లెరూరల్: కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాటసాని ఓబులరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదనంలో జరిగే పోటీల్లో విజేతలకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 16వ తేది లోపు 9885569450 నంబరుకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం తథ్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు నియోజకర్గంలోను, రాష్ట్రంలో ప్రశాతంగా జరుగుతున్నాయని, పట్టభద్రులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని చెప్పారు. అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజాప్రతినిధులను గెలిపిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కో ఆప్షన్ సభ్యులు రషీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

జీవాలకు ఆరోగ్య రక్ష

- డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవతో మూగజీవాలకు సత్వరమే వైద్య సేవలు
- పాడిరైతులు, గొర్రెలు, మేకలు ఉన్న చోటే వైద్యం
- రైతన్నలకు తొలగిన కష్టాలు


ఇంటి వద్దకే వెళ్లి మేకలకు వైద్యం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం 108 సేవలను అమలులోకి తెచ్చి ఉమ్మడి రాష్ట్ర ప్రజల మన్నన్న పొందితే ఆయన తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి నోరులేని మూగజీవాలకు అత్యంత మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పేరుతో రాష్ట్రంలో గతేడాది మే 2022లో అంబెలెన్స్ సేవలు ప్రవేశపెట్టారు. ఇందుకోసం 1962 అనే టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే అంబులెన్స్‌లు పల్లె ముంగిళ్లలోకి వచ్చి సేవలందిస్తున్నాయి.

నియోజకవర్గంలో రెండు అంబులెన్స్‌లు..

మొదట్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్కొక్క నియోజకర్గానికి ఒక్కొక్క పశువుల అంబులెన్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో రెండు వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యశ్రీ అంబులెన్స్‌లు కొనసాగుతున్నాయి. ఈ అంబులెన్స్ సేవలు పల్లెపల్లె ముంగిళ్లలో వాలుతున్నాయి. పశువులు, మేకలు, గొర్రెలు అస్వస్థతకు గురైతే పశువైద్యులు సంఘటనా స్థలానికి వెళ్లి పశువులకు సత్వరవైద్యం అందిస్తున్నారు.

ఉన్న చోటనే వైద్యసేవలు

జీవాలు అస్వస్తతకు గురైతే గుర్తుపట్టేందుకు గొర్రెలు కాపరులకు గాని, యజమానులకు గానీ దాదాపు 1,2 రోజుల సమయం పడుతుంది. పశువులు ఆహారం తీసుకోకుండా, నెరమువేరయకుండా ఉండడం, ఇళ్లలో పెంపుడు కుక్కలు భోజనం చేయకపోవడం లాంటి లక్షణాల ద్వారా అవి అస్వస్థతకు గురయ్యాయని భావిస్తారు. వాటిని పట్టణాలకు తీసుకెళ్లేందుకు వీలు పడక నాటువైద్యం, మండల కేంద్రాలైతే పశువైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించేవారు. ఫలితంగా అస్వస్థతకు గురైన పశువులకు అరకొరగా వైద్యం అందేది. ప్రస్తుతం అంబులెన్స్ సేవలు రావడంతో మూగజీవాలకు 24 గంటల్లోనే వైద్య పరీక్షలు అందుతున్నాయి. 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్ద లేదా పొలం వద్దకే వచ్చి పశువులకు వైద్యం చేస్తున్నారు. దీంతో పశు యజమానులకు వ్యయ ప్రయాసలు తప్పాయి.

వందల సంఖ్యలో జీవాలకు వైద్యం

ఆత్మకూరు మండలంలో పశువుల అంబులెన్స్ సౌకర్యాలు ప్రారంభమైనప్పటకి నుంచి ఇప్పటి వరకు 763 కేసులకు సంబంధించి వైద్య సేవలు అందించారు. ఇందులో పశువులు 298,ఆవులు ,ఎద్దులు 345, గొర్రెలు 70,మేకలు 40, కుక్కలు 10 ఉన్నాయి. అలాగే వెలుగోడు మండలంలో 1,184 జీవాలకు, బండిఆత్మకూరు మండలంలో 777 కేసులు, మహానంది మండలంలో 792 జీవాలకు వైద్యం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఇలా వందల సంఖ్యలో జీవాలకు పశువైద్య సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో వాటిని రక్షిస్తూ సేవలను అందిస్తున్నారు.

కష్టాలు తొలిగాయి



మాకు పశువులు ఉన్నాయి. పశువులు అస్వస్థతకు గురైతే పశువైద్యశాలకు తీసుకువెళ్లేందుకు ఎంతో ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం ముఖ్యమంత్రి అంబులెన్స్ సేవసలు ప్రవేశపెట్టడం ద్వారా పశువుల వద్దకే వైద్య సేవలు అందుతాయి. మేము పశువైద్యశాలకు వెళ్లే బాధలు తప్పి, వైద్యాధికారులు మంచి వైద్య సేవలు అందిస్తారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. – వెంకటేశ్వరనాయక్, ఎస్ఎస్‌తండా

మూగజీవాలకు సత్వరమే వైద్యసేవలు



నోరులేని మూగజీవాలకు వైద్య పరీక్షలు అందించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంచార పశువులకు అంబులెన్స్ సేవలు ప్రవేశపెట్టారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు అంబులెన్స్‌ను ఇచ్చారు. ప్రస్తుతం ఆత్మకూరు, వెలుగోడులలో అంబులెన్స్ ద్వారా పశువులకు వైద్యం అందిస్తున్నాం. –భవానిశంకర్‌రెడ్డి, పశువైద్య సంచాలకులు

దేవస్థానం ఉద్యోగుల ఔదార్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో అన్నదాన విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న శ్రీరామాంజినేయులు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. వారికుటుంబానికి ఆర్థిక సహాయంగా దేవస్థానం ఉద్యోగులు విరాళాన్ని అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం దేవస్థానం ఈఓ ఛాంబర్ లో మృతుని భార్య లావణ్యకు ఈఓ ఎస్ లవన్న చేతుల మీదుగా దేవస్థానంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది వారి ఒక రోజు వేతనం మొత్తం రూ.2,73,128లు డీడీ రూపంలో అందజేశారు.


బాధితురాలికి డీడీ అందజేస్తున్న ఈఓ ఎస్ లవన్న

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల వినియోగదారులు సెల్: 7382614308 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

కురువ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్‌గా పెద్దపక్కీరయ్య

మహానంది: ఆంధ్ర ప్రదేశ్ మాదాసి, మదారి కురువ రిజర్వేషన్ పోరాట సమితి శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్‌గా గాజులపల్లె గ్రామానికి చెందిన గజ్జా పెద్దపక్కీరయ్యను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేబీ పెద్దయ్య సోమవారం నియామకపత్రం అందించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దయ్య, ఉపాధ్యక్షుడు మదాసి కురువ వెంకటప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదారి కురువరాజు ఆధ్వర్యంలో సోమవారం గాజులపల్లెలో జరిగిన సమావేశంలో పెద్ద పక్కీరయ్యను కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. గ్రామ పెద్దలు చౌటుపల్లి శివుడు, గజ్జా పెద్దరామసుబ్బయ్య, లింగమయ్య పాల్గొన్నారు.


సంఘం రాష్ట్ర అధ్యక్షుడి నుంచి నియామకపత్రం అందుకుంటున్న పెద్దపక్కీరయ్య